తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

శుక్రవారం

23 అక్టోబర్ 2026

పేజీలు : 8

Follow :


## రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో ‘కృత్రిమ కరువు’



**- బీఆర్ఎస్ నేతలు బొడ్డు రవీందర్,ఉప్పు రాజ్‌కుమార్**

**- కాళేశ్వరం పునరుజ్జీవం కోసమే 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర**

**- అక్టోబర్ 28న మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు యాత్ర**

**పెద్దపల్లి,అక్టోబర్ 23(జనంసాక్షి) :**

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, రైతాంగానికి తక్షణమే సాగునీటి విడుదల డిమాండ్‌తో ఈ నెల 28 నుంచి మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర మహా సైకిల్ యాత్రను చేపడుతున్నట్లు బీఆర్ఎస్ గోదావరిఖని పట్టణ అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్,బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ సంయుక్తంగా ప్రకటించారు. శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొడ్డు రవీందర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి దశాబ్దాల తెలంగాణ నీటి గోసను తీర్చారని గుర్తుచేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం కేసీఆర్‌పై ఉన్న రాజకీయ అక్కసుతోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చి, రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించిందని మండిపడ్డారు. మేడిగడ్డ వద్ద 80 పిల్లర్లలో ఒకటి రెండు పిల్లర్లకు సమస్య వస్తే,చిన్నపాటి గ్రౌటింగ్ లేదా తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిత్యం 20 వేల క్యూసెక్కులకు పైగా గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నా, 90-93 మీటర్ల లెవెల్ ఉన్నప్పుడు పంపులు ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రాజెక్టులోని వందల కిలోమీటర్ల టన్నెల్స్,పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు అన్నీ సక్రమంగా ఉన్నా,మొత్తం ప్రాజెక్టే పనికిరాదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

- 10 నియోజకవర్గాల మీదుగా సాగనున్న సైకిల్ యాత్ర

- బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్

గతంలో గోదావరి కన్నీటి గోస పేరుతో 180 కిలోమీటర్ల పాదయాత్ర చేసినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాలేదని బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు రెండో పంట వేసుకోవద్దని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని,రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకుంటూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ 400 కి.మీ. సైకిల్ యాత్రను చేపడుతున్నామని వివరించారు. ఈ యాత్ర అక్టోబర్ 28న మేడిగడ్డ వద్ద ప్రారంభమై దాదాపు 10 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా సాగి కొండపోచమ్మ సాగర్ వద్ద ముగుస్తుందని తెలిపారు. కాళేశ్వరం పునరుజ్జీవం కోసం తాము చేపట్టే ఈ పోరాటానికి తెలంగాణవాదులు, ఉద్యమకారులు,యువత,రైతులు,పాత్రికేయ మిత్రులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాశిపాక వాసు,పల్లె మధు,లక్ష్మణ్ గౌడ్,ముత్యం తదితరులు పాల్గొన్నారు.



## 45 రోజుల్లో రైస్ మిల్లర్లు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**- డిఫాల్ట్ రైస్ మిల్లర్ల ఆస్తులను గుర్తించాలి**

**- గడువులోగా బకాయిలు చెల్లించకపోతే ఆస్తుల జప్తుకు చర్యలు**

**పెద్దపల్లి,అక్టోబర్ 23(జనంసాక్షి) :**

డిఫాల్ట్ రైస్ మిల్లర్లు తమ పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం 45 రోజుల గడువు కల్పించిందని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు,డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో బకాయిల వసూళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువును డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకొని, తమకు సంబంధించిన పెండింగ్ బకాయిలన్నింటినీ నిర్ణీత గడువులోగా చెల్లించాలని సూచించారు. డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు సంబంధించిన స్థిర, చర ఆస్తుల వివరాలను సబ్ రిజిస్ట్రార్ అధికారులు గుర్తించి, పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువులోగా బకాయిలు చెల్లించని పక్షంలో సంబంధిత రైస్ మిల్లర్ల ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య,జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్,పౌరసరఫరాల మేనేజర్ శ్రీకాంత్,సబ్ రిజిస్ట్రార్ అధికారులు,సంబంధిత అధికారులు,డిఫాల్ట్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.





## అమర పోలీసు వీరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకం ఎస్ ఐ జ్యోతి

**ముస్తాబాద్ అక్టోబర్ 23 (జనంసాక్షి)**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు అని ఎస్ ఐ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు చట్టాల గురించి, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాల గురించి, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి మరియు సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ ఐ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు మరియు ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని మరియు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉత్సహకంగా పాల్గొన్నారు. గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 112, సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి కూడా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి , ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపల్లెలో బెల్టు షాపులు బంద్‌కు తీర్మానం

**ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందజేసిన సర్పంచ్, పాలకవర్గం**

**ఇల్లంతకుంట, అక్టోబర్ 23 (జనంసాక్షి):**

గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంకట్రావుపల్లె గ్రామంలో బెల్టు షాపులను పూర్తిగా మూసివేయాలని గ్రామ సర్పంచ్, పాలకవర్గం తీర్మానించింది. ఈ మేరకు ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేసినట్లు గ్రామ పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ యువత మద్యానికి బానిస కాకుండా, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగల సమయంలో రాత్రి వరకు మద్యం విక్రయాలు జరగడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బెల్టు షాపుల వద్దకు మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చే వారు రహదారులపై ద్విచక్ర వాహనాలను నిలిపివేయడంతో ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు.

ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని తీర్మానం చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో మద్యం విక్రయాలు నిర్వహించే వారు గ్రామ పాలకవర్గ నిర్ణయానికి సహకరించాలని కోరారు. యువత భవిష్యత్తు, గ్రామ ప్రజల ప్రశాంత జీవనం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చల్ల నవీన్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ అనగోని అవినాష్ గౌడ్, వార్డు సభ్యులు నర్సింగోజు పద్మ, మంద అనిల్ కుమార్, మంద బాలయ్య, మామిండ్ల శ్రీవాణి, జెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాతను నిండా ముంచిన బయో మందులు

**- న్యాయం చేయండి..లేదంటే ఆత్మహత్యే గతి**

**- ప్రెస్‌క్లబ్ వేదికగా అన్నదాత రాజయ్య ఆక్రందన**

**పెద్దపల్లి,అక్టోబర్ 23 (జనంసాక్షి) :**



బయో పురుగుమందుల పిచికారీ వికటించి చేతికొచ్చిన పత్తి పంట సమూలంగా నాశనమైందని,వ్యవసాయ అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం ఇప్పించకపోతే ఆత్మహత్యే శరణ్యమని పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన రైతు కుంటూరి రాజయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన,తన 2 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో సుమారు రూ.2.50 లక్షల మేర అప్పులు చేసి పత్తి సాగు చేయగా, పంటలో దోమ నివారణ కోసం జూలపల్లిలోని శ్రీ రామాంజనేయ పెస్టిసైడ్స్ దుకాణంలో అక్టోబర్ 4న కొనుగోలు చేసిన ఎస్కే రెడ్డి కంపెనీకి చెందిన ప్రెసిడెంట్,వజ్రం బయో మందులను కొనుగోలు చేసి, దుకాణదారు సూచనల మేరకు కలిపి పిచికారీ చేయడంతో చేను మొత్తం ఎర్రబారి మాడిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. దాదాపు రూ.4 లక్షల వరకు దిగుబడి ఆశించిన తనకు అపార నష్టం వాటిల్లిందని,ఈ విషయమై ప్రశ్నిస్తే అటు డీలర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కంపెనీ ప్రతినిధులు మొదట న్యాయం చేస్తామని చెప్పి ప్రస్తుతం ఫోన్లు కూడా ఎత్తడం లేదని వాపోయారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని రైతు తెలిపారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయాలని,సదరు బయో పెస్టిసైడ్స్ నాణ్యత,బ్యాచ్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తనకు పరిహారం అందేలా చూడటంతో పాటు సంబంధిత కంపెనీ,డీలర్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కుంటూరి రాజయ్య డిమాండ్ చేశారు.

# రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక

## లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా చేతుల మీదుగా ఢిల్లీలో అందుకోనున్న జాతీయ పురస్కారం

కామారెడ్డి అక్టోబర్,23 (జనంసాక్షి) కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారం 2026 కు ఎంపిక కావడం జరిగింది. ఈ అవార్డును ఈ నెల 31వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా చేతుల మీదుగా అందు కోవడం జరుగుతుందని అన్నారు.ఈ పురస్కారా నికి అవకాశం కల్పించిన ఐవిఎఫ్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త,ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త,ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ లకు,ఐవిఎఫ్ తెలంగాణ విభాగానికి,19 సంవత్సరాలుగా సహకరిస్తున్న రక్తదాతలకు, శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ 2007లో రక్తదాన కార్యక్రమాలను కామారెడ్డి కేంద్రంగా ప్రారంభించి నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నా మని, వ్యక్తిగతంగా 84 సార్లు రక్తదానం,తల సేమి యా బాధిత చిన్నారుల కోసం 6,000 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించడం, 350 కి పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 30 వేల యూనిట్ల రక్తాన్ని అందజేసినందుకు, రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు గాను ఈ పురస్కారం అందుకోవడం జరిగిందని అన్నారు.ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో తల సేమియా బాధిత చిన్నారుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి వారి ప్రాణాలను కాపాడడం కోసం కృషి చేస్తానని అన్నారు.





**వర్షపు నీటి సంరక్షణ పనులను పరిశీలించిన జిల్లా పరిషత్ సీఈఓ**

సదాశివనగర్, అక్టోబర్ 23 (జనంసాక్షి): గ్రామాల్లో వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాల పెంపునకు చేపడుతున్న పనులను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్ పరిశీలించారు. శుక్రవారం కల్వరాల్ గ్రామంలో జలసిరి కార్యక్రమం కింద కొనసాగుతున్న వర్షపు నీటి సంరక్షణ పనులను, పద్మాజివాడి గ్రామంలో డ్రైనేజీ చివర చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.పనుల పురోగతిని పరిశీలించి, నీటి సంరక్షణ చర్యల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కల్వరాల్ సర్పంచ్ క్యామ నరేందర్, ఎంపీడీవో సంతోష్ కుమార్ , ఏపీవో శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గోదావరిలో మునిగి యువకుని మృతి..

గోదావరిఖని, జనంసాక్షి : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి గోదావరిఖని నగర శివారులోని గోదావరి నది సమ్మక్క గద్దెల వద్ద శుక్రవారం ఉదయం స్నేహితుల తో సరదాగా ఈతకని వెళ్లి మేదరిబస్తీ కు చెందిన గోపి పవన్ (34)మృతి చెందాడు.వివరాలలోకి వెళితే తిలక్ నగర్ కి చెంది ప్రస్తుతం మేదరిబస్తీ లో ఉంటూ .ప్రైవేట్ డ్రైవర్ గా పని చేసే గోపిపవన్ తన స్నేహితులు కుంభాల సందీప్, బోరం రంజిత్, తుంగపల్లి సాయికుమార్ తో కలిసి గోదావరినదికి వెళ్లి మద్యం సేవించారు.అనంతరం సాయికుమార్,సందీప్ కలిసి ఈత కొట్టేందుకు గోదావరి నది లో దిగారు.ఈత రాకపోవటం తో గోపి పవన్ నది లో మునగగా సాయికుమార్, రంజిత్ నీటినుంచి పైకి తీసి రంజిత్ సి పి ఆర్ చేయగా అప్పటికే గోపి పవన్ మృతి చెందాడు.మృతినికి 6 నెలల క్రితమే విడాకులు కాగా మృతిని తల్లి గోపి రాజేశ్వరి పిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ ఏ.ఇంద్రసేన రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



# మాగి పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన వార్తల్లో నిజం లేదు

## ఎంపీడీవోకు వినతిపత్రం అందించిన మాగి గ్రామస్తులు

నిజాంసాగర్ (జనంసాక్షి): మాగి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఇటీవల వచ్చిన పత్రికా ప్రకటనలోని ఆరోపణల్లో వాస్తవం లేదని మాగి గ్రామస్తులు తెలిపారు. ఒక వ్యక్తి తన వ్యక్తిగత కక్షతో, అక్రమంగా నిర్మిస్తున్న ఇంటికి అనుమతి ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిపై ఒత్తిడి తెచ్చేందుకు తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం నిజాంసాగర్ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యదర్శి నిత్యం తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఫొటోల నమోదు, జనన ధ్రువీకరణ పత్రాలు, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీతో పాటు గ్రామ పంచాయతీకి సంబంధించిన వివిధ పనులను సకాలంలో




పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ పంచాయతీ పరిధిలోని పనులను సక్రమంగా నిర్వహిస్తున్న కార్యదర్శిపై వ్యక్తిగత కక్షతో ఆరోపణలు చేయడం సరికాదని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన వార్తలను పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను గుర్తించాలని ఎంపీడీవోను కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి విధుల నిర్వహణపై తప్పుడు ప్రచారం చేయడం వల్ల అధికారుల ప్రతిష్టకు భంగం కలుగుతుందని, వాస్తవాలను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలించిన డి.ఎల్.పి.ఓ: శ్రీనివాస్

భిక్కనూరు అక్టోబర్ 23 (జనం సాక్షి): భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో(ఉపాధి హామీ) వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవిక మిషన్ పథకం కింద చేపడుతున్న పనులను శుక్రవారం డిఎల్ పిఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా పనులు జరుగుతున్న విధానం కూలీలకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పల్లె దవఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు వైద్యసేవలు నిర్వహణ తీరును పరిశీలించారు.ఈక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీవాణి వాసు యాదవ్,ఉపసర్పంచ్ ప్రకాష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి, ఎంపీడీవో సవిత రెడ్డి,ఎంపీఓ రాజ్ కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యత కోసమే దసరా ఆత్మీయ సమ్మేళనం

- ◆మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి
- ◆మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్
- ◆అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 జనంసాక్షి: మున్నూరు కాపుల ఐక్యత కోసమే దసరా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు నిజామాబాద్ తొలి మేయర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్ అన్నారు. శుక్రవారం జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ దసరా పండుగను పురస్కరించుకుని, జిల్లా సంఘం అధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నగరంలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మున్నూరు కాపులు విచ్చేశారు. పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మహిళలు, పురుషులకు, పిల్లలకు మ్యూజికల్ చైర్ గేమ్ ఆడించారు. గెలిచిన వారికి బహుమతులు చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, తొలి మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఐక్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలరని ఆలోచించి జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమ్మేళనంతో పరిచయాలు పెరిగి, ఒకరికొకరు సహాయ సహకారాలు పెరుగుతాయన్నారు. మా నాన్న ధర్మపురి శ్రీనివాస్ సంఘం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, మున్నూరు కాపులందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని సంఘ భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. ఆయన ముందు చూపుతో మున్నూరు కాపులందరికీ సహాయ సహకారాలు అందించారన్నారు. తాను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత వనభోజనాలు ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో,మొదటి సారి దసరా సందర్భంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంతోమంది అహర్నిశలు శ్రమించారన్నారు వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మున్నూరు కాపులు జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అందరికీ హృదయ పూర్వక నమస్కారాలు, దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ సమ్మేళనం జిల్లా నలుమూల వ్యాప్తి చెందేలా చేసి, సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపు సంఘ సభ్యులు హాజరయ్యారు.



## విద్యార్థులతో పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమం

**ఇల్లంతకుంట, అక్టోబర్ 23 (జనంసాక్షి):** విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వర్ రావు సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ విధివిధానాలు, పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పోలీసు భద్రతలో ఉపయోగించే తుపాకులు, మందుగుండు సామగ్రి గురించి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, తమ తల్లిదండ్రులకు సైతం సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సీఐ సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, నేరప్రవృత్తికి దూరంగా ఉంటూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎం. ఉపేంద్ర చారి, ఏఎస్ఐ షఫియుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ లత, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## ఎఎంసి చైర్మన్ మనమరాలు బర్త్ డే వేడుకకు హాజరైన విప్ ఆది

**రుద్రంగి, అక్టోబర్ 24 (జనంసాక్షి)** రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి) చైర్మన్ చేలుకల తిరుపతి మనమరాలు మొదటి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందించిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**వీణవంక అక్టోబర్ 23 (జనం సాక్షి)** వీణవంక మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన చింతిరెడ్డి బుచ్చమ్మ, అనారోగ్య సమస్యతో నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది వారి ఆరోగ్య చికిత్స ఖర్చుల నిమిత్తం రూ. 2,25000 ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎల్ఓసి మంజూరు ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ఓసి మంజూరు చేసిన ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కు బుచ్చమ్మ కుమారుడు కోమల్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పదంతో వెంటనే స్పందించి ఎల్ఓసి మంజూరు ఇచ్చిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కు చింతల శ్యామ్ సుందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.



# బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్ నియామకం

### పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్న పొన్నం శ్రీనివాస్

**చిగురుమామిడి అక్టోబర్ 23(జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పొన్నం శ్రీనివాస్ నియమితులయ్యారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆశీస్సులతో, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ కు పొన్నం శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకానికి సహకరించి, ప్రోత్సాహం అందించిన సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకన్న, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రావు, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్, బీజేపీ చిగురుమామిడి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్‌లకు శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తూ, జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ సూచనలు, మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసి, రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని పొన్నం శ్రీనివాస్ స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ, పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.






## రామన్నపేటలో కేతు బచావో కార్యక్రమం

**మల్యాల అక్టోబర్ 23 (జనంసాక్షి)** ఏలినినో ప్రభావము ఎక్కువగా ఉండటంవల్ల పంటలను సంరక్షించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని మల్యాల మండలం రామన్నపేట గ్రామంలో కేత్ బచావో అభియాన్లో మండల వ్యవసాయ అధికారి కే.చంద్ర దీపక్ తెలిపారు. రైతులు వరి పంట తర్వాత పంట అవశేషాలను కాల్చడం వల్ల నేల ఆరోగ్యం, పర్యావరణం కాలుష్యం అవుతుందని, పంట అవశేషాలను పశుగ్రాసంగా లేదా నేలలో కలియ దున్ని నేల సారం పెంచాలని తెలిపారు. యాసంగిలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున ఆరుతడి పంటలు అయిన మొక్కజొన్న, పెసర, మినుములు, శనగలు, నూనె గింజ పంటలు అయిన ప్రొద్దుతిరుగుడు వేయాలని తెలిపారు. ప్రస్తుతం వరిలో కంకినల్లి మరియు రెల్ల రాల్చుపురుగుకు మందులు వాడాలని తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి మంజువాణి మాట్లాడుతూ యాసంగికి తక్కువ నీటితో, తక్కువ రోజులు పంట అయిన కూరగాయలు, పూల తోటలు, మామిడి, ఆయిల్ పామ్ తోటలకు ఎండాకాలంలో డ్రిప్ ద్వారా నీటి తడులు ఇచ్చి కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వకుళాభరణం మౌర్య, నూకపల్లి సింగిల్ విండో చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి, ఏఈఓ శ్రీనివాస్, రైతులు లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి తీపిరెడ్డి, రమేష్ రెడ్డి, ఐలాపురం తిరుపతి, కనకట్ల నాంపల్లి మరియు రైతులు పాల్గొన్నారు.

## రెండు నెలలైనా బాగుకాని ఫిజియోథెరపీ మిషన్!

### ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా స్పందన కరువు

**గంభీరావుపేట, అక్టోబర్ 23 జనం సాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ మిషన్ పనిచేయకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగన్నపేట గ్రామానికి చెందిన కిషన్ రావు గత ఆగస్టులో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ, రెండు నెలలు గడుస్తున్నా మిషన్‌కు మరమ్మతులు చేయించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఫిజియోథెరపీ సేవలు అందక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంపై సంబంధిత అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫిజియోథెరపీ మిషన్‌కు మరమ్మతులు చేయించి, రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



## గుండెపోటుతో మృతి చెందిన కుమార్ కుటుంబానికి సర్పంచ్ బోయిని రమేష్ రూ.10,116ఆర్థిక సాయం

- ఇద్దరు చిన్నారుల పరిస్థితి చూసి చలించిపోయిన సర్పంచ్..
- కుటుంబ సమేతంగా పరామర్శించి మానవత్వం చాటుకున్న

**చిగురుమామిడి అక్టోబర్ 23(జనంసాక్షి):** మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన జెరిపోతుల కుమార్(32) ఇటీవల గుండె పోటుతో చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన కుమార్ మృతితో ఆ ఇల్లు తీవ్ర శోకసముద్రం లో మునిగిపోయింది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను చూసి గ్రామానికి చెందిన సర్పంచ్ బోయిని రమేష్ తీవ్రంగా చలించిపోయారు. శుక్రవారం సర్పంచ్ బోయిని రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించారు. కుమార్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆ నిరుపేద కుటుంబానికి తక్షణ సాయంగా 10,116రూపాయల నగదును భార్య అనుషకు కుటుంబం సమక్షంలో ఆర్థిక సాయంగా అంద జేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్న వయసులోనే కుమార్ మరణించడం అత్యంత బాధాకరమని, ఆ కుటుంబానికి, ఇద్దరు చిన్న పిల్లలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు పెద్దమనసు చేసుకొని బాధిత కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలవాలని కోరారు. ఆపద సమయంలో స్పందించి నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సర్పంచ్ బోయిని రమేష్ మానవత్వాన్ని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



## కమాన్ పూర్ లో మానవత్వం చాటిన హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు

### పుట్టినరోజున పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ

**కమాన్ పూర్, అక్టోబర్ 23, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు నారగోని సతీష్ గౌడ్ తన పుట్టినరోజును సేవా కార్యక్రమంతో ఘనంగా జరుపుకున్నారు. పుట్టినరోజు సందర్భంగా కమాన్ పూర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న 11 మంది మల్టీపర్పస్ వర్కర్లకు ఒక్కొక్కరికి 1,000 రూపాయల విలువగల 23 రకాల నిత్యావసర సరుకులను గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. గ్రామ పారిశుధ్యం కోసం అహర్నిశలు కష్టపడుతున్న పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి సహాయం అందించడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉప సర్పంచ్ రఫిక్ సోహెల్ పేర్కొన్నారు. తన పుట్టినరోజు వేడుకలకు ఖర్చు చేసే బదులు పేదలకు, కార్మికులకు సహాయం చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు



సతీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు. కార్మికులు తమకు నిత్యావసరాలు అందజేసిన సతీష్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## చలో హైదరాబాద్ మహాధర్నాకు పారిశుద్ధ్య కార్మికుల పిలుపు

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**గంభీరావుపేట అక్టోబర్ 23 జనం సాక్షి;**
గంభీరావుపేట గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాలో పాల్గొనేందుకు గంభీరావుపేట మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సిద్ధమయ్యారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సెలవు మంజూరు చేసి, ధర్నాలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు.గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, కనీస వేతనాన్ని రూ.30 వేలకు పెంచాలని, కార్మికులపై అదనపు భారం మోపుతున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రక్షణ పరికరాలు,



కనీస వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నాలో పాల్గొని తమ డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బరిగెల బిక్షపతి. భగవంతు నవీన్. అంజా గౌడ్ నాందేడ్ రవి. ఎల్లవ్వ. కృష్ణ జేల్ల రాజనర్స్. కార్మికులు పాల్గొన్నారు



## గన్నేరువరం రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ అవగాహన సదస్సు

**గన్నేరువరం, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రారంభించిన "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమంలో భాగంగా గన్నేరువరం మండలకేంద్రం రైతు వేదికలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 22 నుండి నవంబర్ 30 వరకు అమలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఐసీఏఆర్ సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖల సమన్వయంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర సైంటిస్ట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ఖేత్ బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశాలను వివరించారు. అభియాన్ లక్ష్యాలు: నేల పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకంపై అవగాహన, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగు ప్రోత్సాహం, వరి కొయ్యకాలు, పంట వ్యర్థాలు తగలబెట్టకుండా నేల సంరక్షణ,సేంద్రీయ ఎరువుల వాడకంపై శిక్షణ, నీటి సంరక్షణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం, ఈకార్యక్రమం లో గన్నేరువరం సర్పంచ్ రంగనవేణి లచ్చిన్నర్సు, యాస్వాడ సర్పంచ్ కటకం తిరుపతి, ఎమ్మార్వో ఇప్ప నరేందర్, ఏఈఓ వంశీకృష్ణ రెడ్డి, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఏసుమని, రైతులు పాల్గొన్నారు.

## మిత్రుడికి అండగా... ఆపదలో ఆత్మీయ భరోసాగా!

**గన్నేరువరం, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
స్నేహానికి నిదర్శనంగా నిలిచారు ఎస్ ఎస్ సి 2007-08 బ్యాచ్ విద్యార్థులు. ఇటీవల వారి టెన్త్ తోటి విద్యార్థి కుర్ర శ్రీనివాస్ మాతృమూర్తి అనారోగ్యంతో మరణించడం బాధాకరం. ఈ విషాద సమయంలో 2007-08 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు శ్రీనివాస్ ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తమ వంతు సహాయంగా రూ.8 వేల ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. మిత్రత్వం అంటే సంతోషం లోనే కాదు కష్టంలోనూ అండగా నిలవడమని, ఆపదలో అందించే చిన్న సాయం కూడా ధైర్యాన్ని ఇస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఆ మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.





## కేటీఆర్‌కు శ్రీ వెంకటేశ్వర రథోత్సవ ఆహ్వానం

**రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట, జనంసాక్షి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.ఆలయ చైర్మన్ పాపారావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, వార్డ్ సభ్యుడు,వేణుగోపాల్, మాజీ మండల బిఆర్ఎస్ అధ్యక్షులుదయాకర్, అంజయ్య, కిషన్ రావు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లింగన్నపేటలో జరిగే శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న రథోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## తెలంగాణ రక్షణ సేన గన్నేరువరం మండల అధ్యక్షుడిగా గువ్వ అభిషేక్

**గన్నేరువరం, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
తెలంగాణ రక్షణ సేన పార్టీ గన్నేరువరం మండల అధ్యక్షుడిగా మైలారం గ్రామానికి చెందిన యువ నాయకుడు గువ్వ అభిషేక్ ముదిరాజ్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు,



యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు అభిషేక్ కృషి చేస్తారని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గువ్వ అభిషేక్ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర నాయకులు చెన్నమల్ల చైతన్య కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేసేలా కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి అహర్నిశలు పని చేస్తానని స్పష్టం చేశారు. ఆయన నియామకం పట్ల మైలారం గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 23, (జనంసాక్షి) :**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ. వెంకటేష్ విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రోజువారి విధులు, వివిధ చట్టాలు, నేరాల దర్యాప్తులో ఫింగర్ ప్రింట్ డివైస్ వినియోగం, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసుల విధులు, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి తెలుసుకున్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

**గంభీరావుపేట అక్టోబర్ 23 జనం సాక్షి;**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్ విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలు, చట్టాలు, ఆధునిక పోలీసింగ్ విధానాలపై అవగాహన కల్పించారు.నేరాల దర్యాప్తులో ఫింగర్‌ప్రింట్ పరికరాల వినియోగం, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై రమణమూర్తి, ఏఎస్సై దేవేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎంసి చైర్మన్ వైనాల రాజును పరామర్శించిన మంథని సింగిల్ విండో చైర్మన్

**కమాన్ పూర్ అక్టోబర్ 23, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వారి సోదరుడు వైనాల వినోద్ ను, వారి కుటుంబ సభ్యులను మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ వైస్ ఎంపీపీ స్వరూప్ రెడ్డి, బర్ల రాజు ఇజ్జగిరి రాజు లద్దు, అడవి శ్రీరాంపూర్ ఉపసర్పంచ్ అనవేన తిరుపతి, కమాన్ పూర్ సెక్రటరీ తిమ్మరాజు సంతోష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పుట్ట కుమారస్వామి లస్కర్ తదితరులు శుక్రవారం పరామర్శించారు. బుధవారం వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సాంబయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.





## పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు

# ఓపెన్ హౌస్ కార్యక్రమం

**గంభీరావుపేట అక్టోబర్ 23 జనంసాక్షి:**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్ విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలు, చట్టాలు, ఆధునిక పోలీసింగ్ విధానాలపై అవగాహన కల్పించారు.నేరాల దర్యాప్తులో ఫింగర్‌ప్రింట్ పరికరాల వినియోగం, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమణమూర్తి, ఏఎస్సై దేవేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు

**వీణవంక అక్టోబర్ 23 (జనంసాక్షి)**
వీణవంక మండలంలో ఇటీవల అనారోగ్యానికి గురై నియోజకవర్గం ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు వద్ద దరఖాస్తు చేసుకోగా వారు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన దరఖాస్తులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి చెక్కులు రావడం జరిగింది.వీణవంక మండలంలో లబ్ధిదారులకు19 గ్రామలకు గాను,31 చెక్కులు10 లక్షల 50 వేయిల 500 రూపాయల చెక్కులను శుక్రవారం రోజున హుజూరాబాద్ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్, చిన్నాల ఐలయ్య యాదవ్,గంగాడి తిరుపతి రెడ్డి,కొమ్మిడి రాకేష్ రెడ్డి, పంజాల సతీష్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, సర్పంచ్ లు జడల శ్రీకాంత్,దూడపాక శ్రీవాణి - రాజు,అంది శ్రీమతి - కుమార్,అలె మధుసూదన్,చదువు జైపాల్ రెడ్డి,డైరెక్టర్ కామిడి శ్రీపతి రెడ్డి,సునీల్, మ్యాక వీరయ్య,పొనుగంటి మధుకర్,గ్రామ అధ్యక్షులు ఎల్కపల్లి లక్ష్మణ్,బండారి లక్ష్మణ్,తదితరులు పాలుగోన్నారు.

## ఎరాజ్ పల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాల పండుగ

**బోధన్, అక్టోబర్ 23 ( జనంసాక్షి ) :**
బోధన్ మండలం ఎరాజ్ పల్లి గ్రామంలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.మహిళలు వారి వారి ఇంటి వద్ద నుంచి భారీ సంఖ్యలో బోనాలు ఎత్తుకొని భాజా భజంత్రీలతో పోచమ్మ మందిరానికి ఊరేగింపుగా వెళ్లారు.పోచమ్మ తల్లికి మరియు గ్రామదేవతలకు నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.పంటలు కోసే ముందు ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పోచమ్మ పండగ నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవదాస్ గౌడ్,వీడిసి పెద్దోళ్ళ నర్సారెడ్డి,గ్రామ ఉప సర్పంచ్ సురకంటి పవన్ రెడ్డి,గ్రామ పెద్దలు,మహిళలు,యువతీ యువకులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డి సీఐ ఆధ్వర్యంలో సిబ్బందికి వ్యాసరచన పోటీలు

### అమరుల త్యాగాలను స్మరించుకున్న పోలీస్ శాఖ

**ఎల్లారెడ్డి అక్టోబర్ 23 జనం సాక్షి:**
ఎల్లారెడ్డి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన కార్యక్రమం నిర్వహించారు. ఎల్లారెడ్డి సీఐ రాజా రెడ్డి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగిందని సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది అందరూ ఈ వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారని విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

## మండల స్థాయి సమావేశానికి సర్వం సిద్ధం

### అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలి



**సిరికొండ, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీ అహ్మద్ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌరవ సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. మండలానికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు నిర్వహించే ఈ సమావేశానికి సంబంధిత ప్రతినిధులంతా సమయానికి హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

## ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు మరొక అవకాశం



**కామారెడ్డిజిల్లా అక్టోబర్ 23 (జనంసాక్షి)**
కామారెడ్డి జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి షేక్ సలాం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గన్నేరువరం పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



**గన్నేరువరం, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన రామంచ లక్ష్మణ్ (26), హైదరాబాద్ లోని బోయినపల్లికి చెందిన బొంత సౌమ్య (23) గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరిది వేరు వేరు కులాలు కావడంతో పెద్దలు ఒప్పుకోరని భావించి, శుక్రవారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జంగిరెడ్డిపల్లి రామలింగేశ్వర ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమ తల్లిదండ్రుల నుంచి ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ గన్నేరువరం పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.



## ఎల్‌నినో నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేయాలి

### జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి

కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (జనం సాక్షి)
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి రైతులకు సూచించారు. భిక్కనూరు మండలం రాగట్లపల్లి గ్రామంలో కూరగాయల సాగు పొలాలను సందర్శించి పంటల పరిస్థితి, నీటి లభ్యతను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటలకు సరిపడా నీరు అందుతున్నదా అని తెలుసుకున్నారు. ప్రస్తుతం నీటి లభ్యత సరిపోతుందని, పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ వృథాను అరికట్టి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పెద్ద వాల్గొట్‌లో భూభారతి రీ సర్వే..

### గ్రామ శివారు సరిహద్దుల పరిశీలన



**సిరికొండ, అక్టోబర్ 23 జనంసాక్షి:**
జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సిరికొండ తహసీల్దార్ రవీందర్ రావు ఆదేశాల మేరకు భూభారతి రీ సర్వేలో భాగంగా గురువారం సిరికొండ మండలం పెద్ద వాల్గొట్ గ్రామ శివారు సరిహద్దుల పరిశీలన చేపట్టారు. పెద్ద వాల్గొట్, పోత్నూర్ గ్రామాలకు సంబంధించిన శివారు సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సర్వే పనులు నిర్వహించారు. గ్రామాల భూ సరిహద్దులను గుర్తించి, రీ సర్వే ప్రక్రియను కొనసాగించారు.భూభారతి రీ సర్వేలో భాగంగా సంబంధిత గ్రామాల సరిహద్దులను పరిశీలించేందుకు అధికారులు, సర్వే బృందం క్షేత్రస్థాయిలో పాల్గొన్నారు. ఈ ప్రక్రియలో గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద వాల్గొట్ గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, పోత్నూర్ గ్రామ సర్పంచ్ మహిపాల్, వీడీసీ చైర్మన్ చిన్న గంగారెడ్డి, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి పెద్ద గంగారెడ్డి, పెద్ద వాల్గొట్ క్లస్టర్ గ్రామ పాలన అధికారి నవీన్, సర్వేయర్ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పాలన అధికారులు, గ్రామ సేవకులు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏడాది నిరీక్షణ ఫలించింది : ఎమ్మెల్యే చొరవతో చెక్కు మంజూరు

**ఎల్లారెడ్డి అక్టోబర్ 23 జనంసాక్షి :**
ఎల్లారెడ్డి: సీఎం రిలీఫ్ ఫండ్ కోసం గత ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న తనకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో చెక్కు అందడం పట్ల లబ్ధిదారుడు హర్షం వ్యక్తం చేశారు.మల్కాపూర్ గ్రామానికి చెందిన కంత్రెపల్లి పోచయ్య బీఆర్ఎస్ కార్యకర్త తన ఆవేదనను సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. "నేను సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దాదాపు ఒక సంవత్సరం నుంచి ప్రయత్నం చేస్తున్నాను. నాకు చెక్కు వస్తుందని అనుకోలేదు. కానీ పెద్దల సహకారం, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవ తో నాకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందడం ఎంతో సంతోషంగా ఉంది" అని తెలిపారు.తనకు సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్ కు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా నిలుస్తూ, అవసరమైన వారికి సహాయం అందిస్తున్న మదన్ మోహన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



# అమ్మమ్మ గందె కళావతి 100వ జన్మదినోత్సవం

## హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 జనంసాక్షి:**
నిజామాబాద్ నగరానికి చెందిన అమ్మమ్మ గందె కళావతి 100వ జన్మదినోత్సవాన్ని (శతాబ్ది ఉత్సవం) జరుపుకుంటున్న సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆమెకు తన హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. ఒక శతాబ్దపు జీవన ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం అనేది ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. వందేళ్ల సుదీర్ఘ జీవితంలో ఎన్నో అనుభవాలు, మధుర జ్ఞాపకాలు, కుటుంబ విలువలు మరియు ప్రేమానురాగాలు ఇమిడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అమ్మమ్మ తన జీవిత ప్రయాణంలో కుటుంబ సభ్యులందరికీ అందించిన ప్రేమ, ఆప్యాయతలు, నైతిక విలువలు మరియు ఆమె ఆశీర్వాదాలు తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు. భగవంతుని ప్రత్యేక ఆశీస్సులతో అమ్మమ్మ గందె కళావతి మున్ముందు కూడా పరిపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఆమె చల్లని ఆశీస్సులు కుటుంబ సభ్యులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అమ్మమ్మ ఆశీర్వాదం కుటుంబానికి కొండంత అండ లాంటిదని, ఆమె ఆదర్శవంతమైన జీవితం సమాజంలో అందరికీ స్ఫూర్తిదాయకమని గణేష్



బిగాల పేర్కొన్నారు.



## ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

**పిట్లం అక్టోబర్ 26(జనం సాక్షి)**
పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ దుండిగల్ లో నాలుగో సంవత్సరం చదువుతున్న వైష్ణవి కి లయన్స్ క్లబ్ తరఫున హాస్టల్ ఫీజు కొరకు లక్ష ఇరవై వేల రూపాయల చెక్కును అందించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ప్రమోద్ తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణ, గంగ రాజమల్లయ్య, కొంతం రాజు కలిసి ఉన్నత చదువుల కోసం విద్యార్థినికి ల్యాప్ టాప్ అందించారు. పిట్లం మండల పరిధిలోని క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ సంజీవరెడ్డి, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నారాయణ, కార్యదర్శి మారుతి రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు వేణుగోపాల్, రజిని, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి ఇంకుడు గుంతలు తప్పనిసరి

## మండల ప్రత్యేక అధికారి సురేందర్

**లింగంపేట్ అక్టోబర్ 23(జనంసాక్షి)**
ఇంటింటికి ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సురేందర్ సూచించారు. శు క్రవారం మండల పరిషత్ కార్యాలయంలో




పంచాయతీ కార్యదర్శు లకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కార్యదర్శులు జలసిరి కింద ఇంకుడు గుంతలు ప్రతి ఇంటికి నిర్మాణం చేపట్టుకోవాలని గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధం గా పంట పొలాల వద్ద నీటి నిల్వ గుంతలు తవ్వించాలన్నారు. నీటిని గ్రామాల్లో పొదుపుగా వాడాలని ప్రజలకు సూచించాలన్నారు. ఉపాధి పథకంలో భాగంగా ప్రతి కూలికి పని కల్పించాలని పని కల్పించేలా చూడాలన్నారు. జలసిరి పథకాన్ని రైతులతో పాటు ప్రజలు ఉపయోగించుకునేలా కార్యదర్శులు అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఎంపీ ఓ మలహరి కార్యదర్శులు పాల్గొన్నారు.

# అక్రమ ఎస్ఐఆర్ ను రద్దు చేయాలి

- భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- ధర్నా చౌక్ లో జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం
- నిరసన కార్యక్రమంలో వక్తల డిమాండ్



**నిజామాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 జనంసాక్షి:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ను రద్దు చేయాలి, భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, తొలగించబడిన ఓటర్లను యధాతథం గా ఉంచాలని, దేశవ్యాప్తంగా ఎస్ కె ఎం ఇచ్చిన నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్ కే య ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె ఎం జిల్లా కన్వీనర్ వేల్పూర్ భూమయ్య ,ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఆకుల పాపయ్య,ఎస్కేయం కన్వీనర్లు బి. దేవారం, పి వెంకటేష్, పి వరదయ్య,లు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని అక్రమ ఎస్ ఐ ఆర్ కు ముఖ్యంగా విద్యార్థులు, యువతుల పై ఢిల్లీ పోలీసులు, న్యూఢిల్లీలోని ఖీూా-ఃఏఖ కూటమికి చెందిన నేరపూరిత శక్తులు జరిపిన దాడులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాలకు మద్దతుగా అక్టోబర్ 23న జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రైతు కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ పోరాటంలో ూఱఓ నాయకత్వం పాల్గొంటుందని ఎస్ఐఆర్ (ూఎఖీ) ను తక్షణమే రద్దు చేయాలని, భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించి, ఆయనపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. పారదర్శకత లేకుండా ఓటర్ల జాబితా నుండి తొలగించబడిన 13.41 కోట్ల మంది పౌరులందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని, ఎంపిక ప్యానెల్‌లో క్యాబినెట్ మంత్రి స్థానంలో భారత ప్రధాన న్యాయమూర్తిని నియమించేలా 'భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీకాలం) చట్టం, 2023'కు సవరణ చేయాలని వారన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ (అఇఅ), ఎన్నికల కమిషనర్లకు (ఇఅబ) చట్టపరమైన రక్షణ కల్పించే సెక్షన్ 16ను రద్దు చేయాలనీ, ఈ సెక్షన్, హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు లభించే రక్షణల కంటే కూడా తీవ్రమైనదని సుప్రీంకోర్టు తన వ్యాఖ్యలలో పేర్కొందన్నారు. యువ విద్యార్థినులతో సహా నిరసనకారులపై జరుగుతున్న క్రూరమైన దాడులు, హింసలను ఆపాలన్నారు.
శాంతియుత నిరసనలలో పాల్గొంటున్న విద్యార్థులు, యువత మరియు ప్రగతిశీల వాదులను రక్షించడానికి రైతులు ముందుకు రావాలని బీజేపీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కింద రాష్ట్రాల్లో కార్యకర్తలను విచ్చలవిడిగా గృహ నిర్బంధం చేయడం చట్టవిరుద్ధమని, ఇది భారతదేశాన్ని ఒక పోలీసు రాజ్యంగా మారుస్తోందని పౌరుల గోప్యతపై ప్రభుత్వం చేస్తున్న ఇటువంటి మితిమీరిన జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ఎస్.కె.ఎం రైతులకు, ప్రజలకు పిలుపు నిస్తుంది . రాజధానిలో విస్తృతంగా జరుగుతున్న నేరాలను సుప్రీంకోర్టుతో సహా న్యాయవ్యవస్థ సుమోటోగా స్వీకరించ నందుకు, శాంతిభద్రతలు కుప్పకూలడానికి అనుమతించడాన్ని వ్యతిరే కించాలన్నారు. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడానికి రైతులు, సాధారణ ప్రజలు క్రియాశీలంగా ఏకం కావాలని పిలుపు నిచ్చారు. రాబోయే రోజుల్లో జరిగే నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట రాములు, ఎన్ గోవర్ధన్, గోనె లక్ష్మి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, సారా సురేష్, కిషన్ , డి బన్ని, ముత్యాల నారాయణ, బి సాయిలు, జి. భూమన్న, ఆర్. దామోదర్, శ్రీనివాస్ రెడ్డి, రాపాని గంగాధర్, గోవర్ధన్ ,శివ కుమారులు తదితరులు పాల్గొన్నారు.

## మైకును అందించిన సురేష్

**ముస్తాబాద్ అక్టోబర్ 23 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలో గడ్డం సురేష్ వారి తండ్రి గడ్డం రాములు గారి జ్ఞాపకార్థం



గ్రామపంచాయతీకి ప్రచార నిమిత్తం ఒక మైక్ ఇప్పించడం జరిగింది ఈ విధంగా గ్రామంలోని ప్రతి పౌరుడు గ్రామ శ్రేయస్సు కోరుకుని అభివృద్ధికి బాటలు వేయాలని తల కొంత సహాయం చేస్తూ సలహా సూచనలతో ముందుకు నడుస్తే గ్రామం అభివృద్ధిలో మొదటి స్థానానికి వెళుతుంది కాబట్టి మనం చేసే సహాయం చిన్నదా పెద్దదా కాదు గ్రామానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది అని ఆలోచనతో చేసిందే చాలా గొప్పది. ఈ విధంగా మంచి ఆలోచనతో ముందుకు వస్తున్న గ్రామ ప్రజలందరికీ కూడా మరి ముఖ్యంగా గడ్డం సురేష్ గారికి ప్రత్యేకంగా గ్రామ ప్రజల తరఫున గ్రామ పాలకవర్గం తరఫున గ్రామ సర్పంచిగా ధన్యవాదములు తెలుపుతున్నాను. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ దాతలు గడ్డం సురేష్ గౌడ్ వార్డ్ మెంబర్ యాదగిరి గౌడ్ గారు మా మిత్రులు బండి నరసింహులు గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న ఎంఈఓ విజయ్ కుమార్ గౌడ్

### - ఘనంగా సన్మానించిన గౌడ సంఘం నాయకులు

**పెద్దపల్లి,అక్టోబర్ 23(జనంసాక్షి) :**
కమాన్ పూర్ మండలానికి చెందిన ఎంఈఓ విజయ్ కుమార్ గౌడ్ పెంచికల్ పేట్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గౌడ సంఘం అధ్యక్షులు బైరీ అంజయ్య గౌడ్, సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ యాదవ్ తదితరులు ఎంఈఓ విజయ్ కుమార్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పడాల సుధాకర్ గౌడ్,కమ్మెటి సాయి గౌడ్,తాళ్ల నరేందర్,తదితరులు పాల్గొన్నారు.



# నామమాత్రంగానే ప్రారంభం అయిన ఉపాధి హామీలు

- ◆కొన్ని గ్రామాల్లో ఇంకా ప్రారంభం కానీ ఉపాధి హామీ పనులు
- ◆గ్రామపంచాయతీలో ఉపాధి హామీపై కీలకంగా మారిన సర్పంచ్ పాత్ర
- ◆కూలీల సంఖ్య పెరిగేటట్లు చూస్తాం.. ఉపాధి హామీ అధికారి మధు
- ◆నామమాత్రంగానే ప్రారంభమైన ఉపాధి హామీ పనులు..
- ◆కొన్ని గ్రామాల్లో ఇంకా ప్రారంభం కాని పనులు..

గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ అమలుపై కీలకంగా మారిన సర్పంచ్ పాత్ర ఎందుకంటే రెండు గ్రామాలను కలిపి ఒక జిపిగా మార్చిన సమయంలో ఒక గ్రామం వారు పూర్తి సపోర్టుతో సర్పంచ్గా గెలిచిన తరుణంలో మిగతా గ్రామం పై వివక్ష చూపుతున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే గాంధారి మండల కేంద్రంలోని 45 గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు 30 వరకు గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయని మిగతా గ్రామపంచాయతీ పరిధిలో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించి, వలసలను అరికట్టాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం కొన్ని గ్రామాల్లో నామమాత్రంగానే కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. గ్రామాల్లో పనులు ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో కూలీలకు ఉపాధి లభించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న కూలీలు నిరాశకు గురవుతున్నారు. పథకం అమలు తీరుపై గ్రామీణ ప్రాంతాల్లో చర్చ జరుగుతోంది.

**కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రశ్నలు**

గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతోపాటు వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలవుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభమైనా కూలీల హాజరు తక్కువగా ఉండటం, మరికొన్ని గ్రామాల్లో పనులు మొదలుకాకపోవడం వంటి అంశాలు పథకం అమలుపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి, వాటికి అనుగుణంగా పనులు చేపట్టడంతోపాటు కూలీలకు అందుబాటులో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

**కూలీల సంఖ్య పెంచడంలో సర్పంచ్ల పాత్ర కీలకం**

గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పనుల అమలులో సర్పంచ్ల పాత్ర కీలకంగా మారింది. గ్రామాల్లో కూలీలకు పథకంపై అవగాహన కల్పించడం, పని చేయడానికి ఆసక్తి ఉన్నవారిని గుర్తించడం, అవసరమైన పనుల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో ఎక్కువ మంది కూలీలు పనులకు హాజరయ్యేలా ప్రోత్సహిస్తే పథకం లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉంది. గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే పనులను గుర్తించి, వాటి అమలుపై పర్యవేక్షణ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

**కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం**

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించడంతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. అయితే పథకం లక్ష్యాలు నెరవేరాలంటే క్షేత్రస్థాయిలో పనుల గుర్తింపు, అధికారుల పర్యవేక్షణ, గ్రామపంచాయతీల సమన్వయం సమర్థవంతంగా ఉండాలి. పనులు ప్రారంభించని గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

**కూలీల సంఖ్య పెరిగేలా చూస్తాం: ఉపాధి హామీ అధికారి మధు**

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ అధికారి మధు తెలిపారు. గ్రామాల్లో కూలీలు ఎక్కువ సంఖ్యలో పనులకు హాజరయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు ఉపాధి అవకాశాలు అందేలా సంబంధిత గ్రామపంచాయతీలు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

**పథకం అమలుపై దృష్టి సారించాలి**

ఉపాధి హామీ పథకం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కూలీలకు ఉపయోగపడేలా అమలు చేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. పనులు ప్రారంభం కాని గ్రామాల్లో సమస్యలను గుర్తించి, పనులు ప్రారంభమైన గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గాలు సమన్వయంతో పనిచేస్తేనే ఉపాధి హామీ పథకం లక్ష్యాలు నెరవేరుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసిన కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**గుడిసె లేకుండా ఇందిరమ్మ ఇల్లు ఉండాలని కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు..**

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (జనంసాక్షి)**

కామారెడ్డి పట్టణంలోని 13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నిర్వహించిన ముగ్గు పోసే కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతుందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లలిత చిట్టిబాబు, ఆర్ఓ గోపాల్రెడ్డి, రాజుకుమార్, వార్డు ఆఫీసర్ వినయ్, దీప్తి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గడ్డమీది మనమ్మ, దూలం శిరీష, స్వప్న, నారాయణ, రాజేష్, రాజు, సందీప్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## పెద్దమ్మ దేవి అన్నప్రసాదంలో మున్సిపల్ చైర్పర్సన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (జనం సాక్షి)**

కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మ దేవి అన్నప్రసాద కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని, సంప్రదాయాలను పెంపొందించడం తో పాటు ప్రజల్లో ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కాళ్ల గంగరాజు, పున్న రాజేశ్వర్, ఉపాధ్యక్షులు చిట్యాల రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నర్సింలు, శెంకర్, ఆశయ్య, రాజు తదితరులు, సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇల్లు ముగ్గు

తాడ్వాయి (అక్టోబర్ 23 జనం సాక్షి )

ఈరోజు నందివాడ పల్లెగడ్డ తండా గ్రామ పంచాయతి పరిదిలో గల పిరమయి కుంట తాండ లోమెగావత్ జాగుర్ కి గౌరవ ఎమ్ ఎల్ ఏ మదన్మోహన్ రావు అన్నగారి అదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు ముగ్గు పోయడనీ జరిగింది. ఇందులో తాండ సర్పంచ్ జాదావు రెనుక గణపతి పార్టీ అధ్యక్షులు బానోత శ్రీను నానుకులు పండరి నంది వాడ సర్పంచ్ సంకు పోచయ్య విలేజు అధ్యక్షులు కనగల్ల బాల్ సాయిలు కార్యదార్శి రవికాంత్ సిని యర్ నాయకుడు బాబుసింగ్ , తాండవసులు పాల్గోనాడం జరిగింది. ఎమ్ ఎల్ ఏ కి దన్యనదలు తెలియ జేయడం జరిగింది.

## రైతులకు అందుబాటులో శనగ విత్తనాలు

**సదాశివనగర్ అక్టోబర్23 (జనంసాక్షి):**

సదాశివనగర్ మండలానికి వ్యవసాయ శాఖ ద్వారా 600 బస్తాల ఔఃఇఉ-47 రకం శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి తెలిపారు . ఒక్కో బస్తా 25 కిలోలు కాగా, పూర్తి ధర రూ.2,500. రూ.1,000 సబ్సిడీ పోను రైతులు రూ.1,500 చెల్లించి విత్తనాలు పొందవచ్చు. శనగ సాగు చేయాలనుకునే రైతులు పట్టాదారు పాస్బుక్, ఆధార్ కార్డుతో స్థానిక రైతు వేదికలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

### సంతాయిపేట్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో

## అవగాహన కార్యక్రమం

**తాడ్వాయి (అక్టోబర్ 23 జనంసాక్షి)**

యెల్లారెడ్డి డీఎస్పీ శ్రీ ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ఎస్ఎస్ నగర్ సర్కిల్ సీఐ వీరయ్య, తాడ్వాయి ఎస్ఐ వై. నరేష్ మరియు పోలీసు సిబ్బందితో కలిసి సంతాయిపేట్ గ్రామంలో సుమారు 100 మంది గ్రామస్థుల సమక్షంలో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా సమస్య ఎదురైనప్పుడు 1903 సేవలను వినియోగించుకోవడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, మెసేజ్లు, లింకులు మరియు ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. మురియు రోడ్డు ప్రమాదాల గురించి, రోడ్డు భద్రత నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని వివరించారు. బాలలను పనిలో పెట్టకుండా వారి విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాలల హక్కులను పరిరక్షించేం దుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సుమారు 100 మంది పాల్గొని, పోలీసుల సూచనలను పాటిస్తూ సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణ, బాల కార్మిక వ్యవస్థ మరియు బాల్య వివాహాల నిర్మూలనకు సహకరిస్తామని తెలిపారు.

